సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



వినతుల పరిష్కారం

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. - 8లో



చిరుధాన్యాల సాగు పెంచేలా రైతుకు అవగాహన

చిరుధాన్యాల సాగును పెంచేలా జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించాలని జేసీ మయూర్ అశోక్ అన్నారు. - 8లో



చిన్నారులకు చిరాయువు..!

నిరుపేద కుటుంబాల పిల్లలకు సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వైద్య భరోసా కల్పించారు. సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న పిల్లల వైద్యం కోసం రూ.32లక్షలు మంజూరు చేశారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ (సా॥)	బుధ (ఉ॥)
6:18	4:13

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

- నేటి నుంచి శిక్షణ తరగతులు

పార్వతీపురం: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు సిద్ధమయ్యే గిరిజన బాల, బాలికలకు మంగళవారం నుంచి గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి బి.సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్ష రాసిన గిరిజన విద్యార్థినీ విద్యార్థులు శిక్షణకు అర్హులన్నారు. సాంకేతిక విద్యాశాఖ సంచాలకుడి ఆదేశాల మేరకు శిక్షణకాలంలో బాలురకు మాత్రమే ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు తమ పరిధిలో పదోతరగతి పరీక్షలు రాసిన గిరిజన విద్యార్థులకు అవగాహన కల్పించి శిక్షణకు హాజరయ్యేలా చూడాలని కోరారు.

పేదలకు మేలు చేయడమే లక్ష్యం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో ప్రతి పేదవాడికి మేలు చేయడమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని ఆండ్ర గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం మంజూరుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ఆర్థికోన్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. దేశంలోనే అత్యధిక మొత్తంలో పింఛన్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని పేర్కొన్నారు. పంటల సాగుకు రైతులకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాల మంజూరుతో పాటు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక ఊతం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వాకపల్లి లక్ష్మి, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్‌ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, పార్టీ మండల నాయకుడు లెంక రత్నాకర్, కనిమెరక త్రినాథ్, హనుమంతరాజు, బాయిప్పారావు, చెల్లూరి మధు, ఎంపీడీఓ తివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబుతో పాటు పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

పార్వతీపురంటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పార్వతీపురం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ కోర్సుల్లో 2019–2022 మధ్య ఉత్తీర్ణత సాధించి, 18–24 సంవత్సరాల మధ్య నిరుద్యోగ మహిళలు జాబ్‌మేళాకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్సులు, ఒక పాస్‌ఫొటోతో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. విద్యార్హతను బట్టి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 91823 98325, 63034 93720 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కొత్త బాధ్యతలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కార్యాలయం సూపరింటెండెంట్‌గా సంచాన నారాయణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చీపురుపల్లి, బొండపల్లి పీహెచ్‌సీల్లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై సూపరింటెండెంట్‌గా సర్వజన ఆస్పత్రిలో నియామకమయ్యారు.

‘తోటపల్లి’ పనులు చకచకా



బొబ్బిలి మండలం పిరిడి వద్ద కాలువలు, మదుముల నిర్మాణం



తోటపల్లి ప్రాజెక్టు... విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల రైతులకు సాగునీటి ఆదరవు. సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న ప్రాజెక్టును గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఆధునికీకరణ చేయాలన్న రైతుల విన్నపాలను చెత్తబుట్టలకే పరిమితం చేసింది. ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టు లక్ష్యం నెరవేర్చే దిశగా సాగుతోంది. జలయజ్ఞం క్రతువును పూర్తిచేసేందుకు దశలవారీగా పనులు చేయిస్తోంది. తాజాగా బడ్జెట్‌లో రూ.80కోట్లు కేటాయించింది. కాలువల తవ్వకాల పనులు చకచకా సాగుతుండడంతో మెట్టభూముల రైతుల్లో కొత్త ఆశలు మొలకెత్తుతున్నాయి.

- జూలై నాటికి 20 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు
- రూ.80 కోట్ల నిధులతో జోరుగా పిల్ల కాలువల తవ్వకం, భూ సేకరణ పనులు
- రాజాం సబ్ డివిజన్‌లో మరో 28వేల ఎకరాల ఆయకట్టుకు పిల్ల కాలువల తవ్వకాలు షురూ
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే 83వేల ఎకరాలకు సాగునీరు

బొబ్బిలి:

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలో ఉన్న తోటపల్లి ప్రాజెక్టు.. మూడు జిల్లాల పరిధిలోని మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు. జలయజ్ఞంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి రూ.800 కోట్ల ఖర్చుతో ప్రాజెక్టు పనులు పూర్తిచేసే క్రతువును చేపట్టారు. పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని సమృద్ధిగా సరఫరా చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగారు. ఆయన మరణానంతరం టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టు లక్ష్యాన్ని విస్మరించింది. పనులు పూర్తిచేయడంపై శ్రద్ధ చూపలేదు. కనీసం పిల్ల కాలువల తవ్వకానికి, ఉన్న కాలువల్లో పూడికలు తొలగించే పనులపైనా ఆసక్తిచూపలేదు. ఫలితం.. వేలాదిమంది రైతుల సాగునీటి ఆశలు అడియాశలే అయ్యాయి. వైఎస్సార్ హయాంలో జరిగిన పనులతో 64వేల ఎకరాల ఆయకట్టుకే మొన్నటివరకు సాగునీరు అందే పరిస్థితి. తండ్రి ఆశయాలను పునికిపుచ్చుకున్న జగన్‌మోహన్‌రెడ్డి.. తోటపల్లి ప్రాజెక్టు లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా సాగుతున్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. బీడు భూముల్లో బంగారు పంటలు పండుతాయని ఆశ పడుతున్నారు.

83వేల ఎకరాలకు సాగునీరు..

తోటపల్లి ప్రాజెక్టు లక్ష్యం 2లక్షల ఎకరాలు కాగా 64వేల ఎకరాలకే సాగునీరు అందుతోందని, పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు ప్రజాసంకల్ప యాత్రగా వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి వినతులు అందజేశారు. దీంతో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టు పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. 83వేల ఎకరాలకు సాగునీరు అందించే పనుల ప్రణాళిక రూపొందించారు. తాజాగా బడ్జెట్‌లో రూ.80 కోట్లు కేటాయించారు. దీంతో మరో 20వేల ఎకరాలకు సాగునీరు అందించే మిగులు పనులను జలవనరుల శాఖ అధికారుల ఆధ్వర్యంలో చకచకా సాగుతున్నాయి. రెండు ప్యాకేజీల్లో పనులు పూర్తిచేస్తున్నారు.

జోరుగా పిల్ల కాలువల తవ్వకం..

తోటపల్లి ప్రాజెక్టు ప్రధాన కాలువ తవ్వకంపై గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కాలువ తవ్వకంలోని లోపాల వల్ల ఆయకట్టుకు సాగునీరు అందనిపరిస్థితి. మరోవైపు పిల్లకాలువల తవ్వకాన్ని విస్మరించింది. ప్రస్తుత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పిల్ల కాలువల నిర్మాణంపై దృష్టిసారించింది. దీనికి అవసరమయిన భూ సేకరణ ప్రక్రియను ఇంచుమించుగా పూర్తిచేసింది. పిల్లకాలువల తవ్వకాలను జోరుగా సాగిస్తోంది. చీపురుపల్లి, బొబ్బిలి మండలం పిరిడి వద్ద మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో పిల్ల కాలువల పనులకు శంకుస్థాపన చేసి పనుల జోరు పెంచారు. ఇప్పుడు ఈ పనులు జోరుగా సాగుతున్నాయి.

20 వేల ఎకరాలకు సాగునీరు

తోటపల్లి పరిధిలో బొబ్బిలి డివిజన్ పరిధిలోని తోటపల్లి పిల్లకాలువల నిర్మాణం పూర్తి చేసి జూలై నాటికి సాగునీరు అందించేందుకు లక్ష్యంగా జలవనరుల శాఖ అధికారులు పనులు చేస్తున్నారు. గత ఏడాది 8వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేశారు. ఇప్పుడు మిగిలిన 12వేల ఎకరాలకు కూడా సాగునీరు అందించేలా పనులు చేస్తున్నారు. తోటపల్లి మిగులు పనులకు ప్రభుత్వం రూ.80 కోట్లు కేటాయించడంతో పిల్లకాలువల తవ్వకాలకు ఎటువంటి నిధుల సమస్య లేదని జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం బొబ్బిలి మండలం పిరిడి నుంచి ప్రారంభమయిన పనులు చీపురుపల్లి వరకూ కొనసాగుతున్నాయి.

రాజాం సబ్ డివిజన్లో మరో 28వేల ఎకరాలు

తోటపల్లి ప్రాజెక్టు ద్వారా రాజాం సబ్ డివిజన్‌లో మరో 28వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించే పనులు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ భూ సేకరణ, ఇతర నిర్మాణాలు చేపట్టాల్సింది. ప్రస్తుతం పాగిరి దాటే వరకూ కాలువల నిర్మాణం సాగుతోంది.



రాజాం మండలం పాగిరి వద్ద పొక్లెయిన్‌తో కాలువ తవ్వకం

జూలై నాటికి కొత్త ఆయకట్టుకు నీరు



కొత్త ఆయకట్టు 20వేల ఎకరాల్లో ఇప్పటికే 8వేల ఎకరాలకు సాగునీరు అందించాం. మిగిలిన 12 వేల ఎకరాలకు జూలై నాటికి పూర్తిగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కాంట్రాక్టర్లకు పనుల జోరు పెంచాలని సూచించాం. దీనికి సంబంధించిన పనులు జోరుగా సాగుతున్నాయి.

– రామచంద్రరావు, ఈఈ, తోటపల్లి మేజర్ ప్రాజెక్టు

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

- పార్వతీపురం డివిజన్‌లో నాలుగు రోజుల్లో 109 కేసుల నమోదు
- డీఎస్పీ ఎ.సుభాష్



మాట్లాడుతున్న డీఎస్పీ సుభాష్

పార్వతీపురంటౌన్: బహిరంగంగా మద్యం తాగినా, ప్రజలకు ఇబ్బంది కలిగించినా క్షమించేది లేదని పార్వతీపురం డీఎస్పీ ఎ.సుభాష్ హెచ్చరించారు. స్థానిక విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. పార్వతీపురం పట్టణం, డివిజన్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. బహిరంగ మద్యసేవనం కట్టడిలో భాగంగా నాలుగు రోజులుగా స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటివరకు పార్వతీపురం పట్టణ పోలీసులు 29 మంది పైన, పార్వతీపురం ట్రాఫిక్ పోలీసులు 22 మందిపైన, పార్వతీపురం రూరల్, సీతానగరం, కొమరాడ, బలిజిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో 58 మందిపై కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. పార్వతీపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో గస్తీపెంచి సాయంత్రం వేళల్లో మహిళలను, ఆడపిల్లలను వేధించే ఆకతాయి, మందుబాబులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పట్టణ శివార్లలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను గుర్తించినా పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



పట్టణంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని అడ్డుకుంటున్న ఎస్‌ఐ సీతారాం

సమ్మేటివ్-2 ప్రశ్నపత్రాలు సిద్ధం



బలిజిపేట ఎమ్మార్సీలో ప్రశ్నపత్రాలను సరిచేస్తున్న సీఆర్పీలు

బలిజిపేట: సమ్మేటివ్-2 పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ప్రశ్నపత్రాలను ఆయా పాఠశాలలకు పంపేందుకు ఎమ్మార్సీల సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. బలిజిపేట మండలంలోని 43 ప్రాథమిక పాఠశాల్లో 1,375 మంది విద్యార్థులు, 4యూపీ పాఠశాలల్లో 449 మంది, 8 ఉన్నత పాఠశాలల్లో 1,887 మంది విద్యార్థులు ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మేటివ్-2 పరీక్షలు రాయనున్నట్టు ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలల వారీగా విభజించిన ప్రశ్నపత్రాలను ఆయా పాఠశాలలకు అందిస్తామని ఎంఈఓ తెలిపారు.

గడపగడపకూ మన ప్రభుత్వం

ఇదొక ఉద్యమం.. ఒక పండగ!

- ప్రతి కుటుంబాన్నీ కలుస్తున్నాం
- సంక్షేమ, అభివృద్ధి పాలనను వివరిస్తున్నాం
- ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నాం
- పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

‘గడపగడపకూ మన ప్రభుత్వం... గతంలో చూడనిది! ఏ రాజకీయనాయకుడూ ఊహించనిది. ఇదొక ఉద్యమం. ఇదొక పండగ. ప్రతి కుటుంబాన్నీ కలిసి, ప్రతి ఇంటి తలుపు తట్టి వారి సమస్యలు నేరుగా తెలుసుకోవడం, వాటికి పరిష్కారం చూపడం ఓ అద్భుతమని రాజకీయ నాయకులే తన్మయం చెందుతున్న కార్యక్రమం. గత 45 నెలలుగా సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నదీ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎక్కడైనా నిర్లక్ష్యం జరుగుతుందా? అని తెలుసుకునేందుకు ఎమ్మెల్యేలను నేరుగా ప్రజల వద్దకు పంపిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని విమర్శకులు సైతం మెచ్చుకోకుండా ఉండలేరు’ అని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు విస్పష్టంగా చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తిచేసుకున్న ఆయనకు సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన ‘సాక్షి’తో ప్రత్యేకంగా మాట్లాడారు. తన అనుభవాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

సాక్షి ఇంటర్వ్యూ

ప్రతి కుటుంబాన్నీ కలుస్తున్నాం...

ముఖ్యమంత్రి మాకు విధించిన లక్ష్యం కన్నా ఇక్కడ మేము ఎక్కువగానే రీచ్ అయ్యాం. ఒక్కో సచివాలయం పరిధిలో కనీసం 90 శాతం మంది జనాభాను ఎమ్మెల్యే కలవాలనేది, ఆ గ్రామంలో కచ్చితంగా రెండు రోజుల పాటు కార్యక్రమం ఉండాలనేదీ లక్ష్యం. మా పార్వతీపురం నియోజకవర్గంలో ప్రతి కుటుంబాన్నీ కలుస్తున్నాం. రెండు కాదు కొన్ని గ్రామాల్లో మూడు రోజులపాటు సందర్శించిన సందర్భాలు ఉన్నాయి. అక్కడే భోజనం చేస్తూ మమేకమవుతున్నాం. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు... ఇలా ఎవరు ఏ సమస్యను మా దృష్టికి తెచ్చినా వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాడు ప్రతిపక్షనేతగా ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల గుండెచప్పుడు విన్నారు.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారందరి తలుపు తట్టి సంక్షేమ పథకాలు చేరువ చేసిందని చెప్పడానికి గర్వపడుతున్నాను.

గ్రామాలపై గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం...

గ్రామాలను గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఉదాహరణకు చంద్రన్న బాట చూస్తే ఎక్కడో టీడీపీ నాయకులు, ఆ పార్టీ కార్యకర్తల కళ్లాల వద్దకు అవీ చిన్న చిన్న రోడ్లు వేసుకున్నారు. అవీ నాణ్యత లేక కొద్దిరోజులకే శిథిలమైపోయాయి. ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు కూడా వృథా చేసేశారు.

200 రోజులు విజయవంతంగా...

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మా పార్వతీపురం నియోజకవర్గంలో 200 రోజులు పూర్తి చేసుకున్నాం. మొత్తం 76 సచివాలయాలకు గాను ఇప్పటివరకూ 63 సచివా లయాల పరిధిలో నిర్వహించాం. సుమారు రూ.12.40 కోట్ల మేర అభివృద్ధి పనులు మంజూరు చేశాం. దాదాపు రూ.5 కోట్ల మేర పనులు పూర్తి చేయించాం. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రద్ధచూపుతోంది.

ఇప్పుడు ఒక్కో గ్రామానికి రూ.కోటి ఆస్తి...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఇప్పుడు ఒక్కో గ్రామానికి కనీసం రూ.కోటి విలువైన ఆస్తులు సమకూరాయి. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.16.50 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ (ఆరోగ్య కేంద్రం)కు సొంత భవనాలను ప్రభుత్వం నిర్మించింది. నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను బాగు చేసింది. వీటన్నింటితో పాటు ప్రతి సచివాలయం పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేయడానికి మాకు వీలు కల్పించింది. ఇలా.. లెక్కేస్తే ప్రతి గ్రామంలో రూ.కోటికి పైగా విలువైన ఆస్తి ఇప్పుడు ప్రజల కళ్ల ముందు కనిపిస్తోంది.

మా హయాంలో మరెన్నో అభివృద్ధి పనులు

ఆస్పత్రుల ఆధునికీకరణ, గ్రామాల అనుసంధాన రహదారుల నిర్మాణం, బీటీ రోడ్లు, వంతెనలు... ఇలా మా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మరెన్నో అభివృద్ధి పనులు జరిగాయి. ఇంకా కొన్ని జరుగుతున్నాయి. మా పార్వతీపురం నియోజకవర్గం పరిధిలోనే దీర్ఘకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న పనులకు మోక్షం కలిగింది. సీతానగరం మండలం గెడ్డలుప్పి గ్రామంలో రూ.13 కోట్లతో బ్రిడ్జి నిర్మించాం. బలిజిపేట మండలం నారాయణపురంలో రూ.16 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మధ్యలో ఆగిన సీతానగరం అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణాన్నీ పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాను.

ఇదంతా అభివృద్ధి కాదా?

బొబ్బిలి నుంచి పార్వతీపురం వరకూ దాదాపు 28 కిలోమీటర్ల పొడవున రోడ్డు ఆధునీకీరణ, పార్వతీపురం బైపాస్ రోడ్డు నిర్మాణం, వెంకంపేట నుంచి కోరాపుట్ వరకూ రూ.17.50 కోట్ల వ్యయంతో రోడ్డు, చిన్నబోగిలి నుంచి మక్కువ వరకూ రూ.55 కోట్ల ఎన్‌డీబీ నిధులతో రోడ్డు, కాశీయ్యపేట నుంచి కోమటిపల్లి వరకూ రూ.5 కోట్లతో, మరిపివలస నుంచి బూర్జ వరకూ రూ.3 కోట్లతో, లక్ష్మీపురం నుంచి వెంకటాపురం వరకూ రూ.2 కోట్లతో రోడ్లు పూర్తయ్యాయి. తానసీతారామపురంలో, అంటిపేట నుంచి రామవరం వరకూ, కాశీపేట జంక్షన్ నుంచి జగ్గునాయుడుపేట వరకూ, సుభద్ర నుంచి బర్లి వరకూ, శివరామపురం నుంచి చెల్లింపేట వరకూ... ఇలా నాలుగేళ్ల కాలంలో 50కి పైగా బీటీ రోడ్లను నిర్మించాం. దాదాపు రూ.10 కోట్లతో ఆస్పత్రులను ఆధునీకరించాం. ఇదంతా అభివృద్ధి కాదా? నేను నా నియోజకవర్గంలో ఇప్పటివరకూ 83 శాతం కుటుంబాలను కలిశాను. సగానికిపైగా ప్రజలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనపై శతశాతం సంతృప్తితో ఉన్నారు.



గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్.కోట పోలీసులు

294 కిలోల గంజాయి పట్టివేత

ఎస్.కోట: అరకు నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎస్.కోట పోలీసులు పట్టుకున్నారు. రెండు పార్టీల నుంచి, 294 కిలోల గంజాయి, 71వేల నగదును సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్.కోట సీఐ సింహాద్రినాయుడు, ఎస్.ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..

ఎస్.కోట పట్టణ పోలీసులు పందిరప్పన్న కూడలిలో సోమవారం వాహనతనిఖీలు జరిపారు. అరకు నుంచి వస్తున్న స్విఫ్ట్ డిజైర్ వాహనాన్ని చెక్ చేయగా 124 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో వాహనంలో ప్రయాణం చేస్తున్న ఒక మహిళ, తమన్నా జావెద్‌షేక్ (నాసిక్), ఇద్దరు పురుషులు మొన్సిఫ్ సోఫియా అబ్దుల్‌బరి, మొన్సిఫ్ అజీమ్ (భీమండి) ఠానేలకు చెందిన మహారాష్ట్ర వాసులుగా గుర్తించారు. వీరి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రూ.71వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడి వారిలో తమన్నా జావెద్‌షేక్ ఇద్దరు పిల్లలు స్టేషన్‌లో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. అలాగే, దేవీ కూడలిలో మధ్యాహ్నం నిర్వహించిన వాహన తనిఖీలలో డస్టర్ వెహికల్‌లో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో వెహికల్‌లో ఉన్న రాజస్థాన్ బిల్వారాకు చెందిన బరూలాల్ సర్గామ్, జత్‌పూరాకి చెందిన రోషల్‌మశిలను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు మొబైల్స్, 170 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్టు చెప్పారు.



గంజాయితో పట్టుబడిన వాహనాలు

క్లుప్తంగా

ఇసుక లారీ సీజ్



సీజ్ చేసిన లారీతో ఎస్సై హరిబాబు నాయుడు

గుర్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మండలంలోని ఆనందపురం వద్ద ఎస్సై హరిబాబు నాయుడు సోమవారం పట్టుకున్నారు. కోటగండ్రేడు, కలవచర్ల, గోషాడ, గుర్ల పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను లారీలతో తరలిస్తున్నారని సమాచారం అందడంతో వెళ్లి ఇసుక తరలిస్తున్న ఒక లారీని పట్టుకుని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య



ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంధ్య

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడువలస గ్రామానికి చెందిన పుర్రి సంధ్య (28) సోమవారం వేకువజామున చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు చినమేరంగి ఎస్సై జి.కళాధర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. రామినాయుడువలసకు చెందిన పోలిరాజుతో 9 సంవత్సరాల క్రితం సంధ్య వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలతో వారి కాపురం బాగానే సాగుతోంది. అయితే మనస్పర్ధలతో ఆదివారం రాత్రి భార్యాభర్తలు ఘర్షణ పడడంతో సంధ్య మనస్తాపం చెందిన సోమవారం వేకువజామున ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి యడ్ల గౌరు ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముద్దాయికి రూ.వెయ్యి జరిమానా

పార్వతీపురం: ఫిర్యాదు దారు పొలంలోకి చొరబడి నీరువెళ్లే ప్లాస్టిక్ పైపును రంపపు బ్లేడ్‌తో కోసి మోటార్ నుంచి వేరుచేసిన గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన గుంట్రెడ్డి శివున్నాయుడు తండ్రి అప్పలస్వామి నాయుడిపై అభియోగం రుజువు కావడంతో పార్వతీపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సోమవారం వెయ్యి రూపాయలు / రిమానా విధించినట్లు ఏపీపీ చంద్రకుమార్ తెలిపారు. 2019లో గుంట్రెడ్డి శివున్నాయుడు తండ్రి గట్టంనాయుడు ఫిర్యాదు మేరకు గరుగుబిల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఏపీపీ చంద్రకుమార్ ఫిర్యాదు ఆరు తరపున వాదించారు. విచారణలో అభియోగం రుజువు కావడంతో ముద్దాయికి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

20 మొబైల్స్ రికవరీ



బాధితులకు సెల్ ఫోన్‌లను అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు ఏర్పాటుచేసిన వెబ్‌పోర్టల్ విజెడ్ఎమ్ మొబైల్ ట్రాకర్ డాట్ ఇన్, వాట్సాప్ నంబర్ 8977945606కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సైబర్ పోలీసులు చర్యలు చేపట్టి 20 స్మార్ట్ ఫోన్‌లను రికవరీ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా బాధితులకు వాటిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లిన ఫోన్‌లను సైతం ఇక్కడికి తెప్పించగలుగుతున్నామన్నారు. బాధితులకు ఫోన్‌లను అందజేయడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ఇ.నరసింహమూర్తి, సైబర్ సెల్ ఎస్సై ప్రశాంతకుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,030-00
బంగారం(22సి. 10గ్రా.)	55,950-00
వెండి (కిలో)	81,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹ 216

నిర్ణీత కాలవ్యవధిలో వినతుల పరిష్కారం

- స్పందనకు జిల్లా అధికారుల హాజరు తప్పనిసరి
- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ దిశానిర్దేశం



దివ్యాంగుల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జేసీ మయూర్ అశోక్



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వినతుల పరిష్కారాన్ని అత్యంత ముఖ్యమైన అంశంగా భావించాలని అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి .ఎస్ దిశానిర్దేశం చేశారు. స్పందన ప్రజా వినతుల పరిష్కారంపై కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత కలెక్టరేట్ ఆడిటోరియంలో తొలిసారిగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. వారి కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని గ్రీవెన్స్ సెల్‌కు పంపితే అనుమతించేది లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు ఏదైనా ముఖ్యమైన సమావేశానికి వెళ్లాల్సి వస్తే ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిల్లో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది వినతులు పరిష్కరిస్తున్న తీరుపై జిల్లా అధికారులు శాంపిల్‌గా కొన్ని వినతులు పరిష్కారం జరిగిన విధానాన్ని తనిఖీ చేయాలని చెప్పారు. నిర్ణీత వ్యవధిలోనే వినతుల పరిష్కారం జరగాలని ఈ విషయంలో జాప్యాన్ని సహించేది లేదన్నారు. మండల ప్రత్యేక అధికారులంతా కొనసాగుతారని ఇంతవరకు ముందు పనిచేసిన మండలాల్లోనే పర్యటించి కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలీల, బీ.సుదర్శన దొర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 166 వినతులు

కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 166 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 105, హౌసింగ్ 10, మున్సిపల్ శాఖ 10, డీఆర్‌డీఏ 10 వినతులు కాగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్‌లు సూర్యనారాయణ, పద్మలత, సుదర్శనదొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

పొదుపు సంఘాల సొమ్ము స్వాహాపై ఫిర్యాదు

సంతకవిటి మండలంలోని బొబిడివలస గ్రామానికి చెందిన జనజ్యోతి, శివపార్వతి పొదుపు సంఘాల రూ.1.35 లక్షల సొమ్మును సంబంధిత ఆర్‌పీ ఎచ్చెర్ల శారదాంబ స్వాహాచేసిందని పొదుపు సంఘాల సభ్యులు ఫిర్యాదు చేశారు. సభ్యుల అనుతి లేకుండా బ్యాంక్ నుంచి సొమ్ము తీసుకుందని తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

స్పందనకు 80 అర్జీలు

పార్వతీపురం: నిర్ణీత గడువులోగా స్పందన అర్జీలను పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి 80 అర్జీలను స్వీకరించారు.

అర్జీల వివరాలిలా..

- గుమ్మలక్ష్మీపురం మండలం కల్లటి గ్రామంనుంచి దిబ్బలగూడ గ్రామానికి రోడ్డు సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నామని, సీసీ రహదారిని నిర్మించాలని సీమల సుబ్బారావు, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు.
- గుమ్మలక్ష్మీపురం మండలం కేసరిగూడ గ్రామానికి రక్షిత మంచినీటి పథకం కింద తాగునీటిని సరఫరా చేయాలని, కేసరి నుంచి కేసరగూడ వరకు రహదారి, వీధి కాలువలు నిర్మించాలని పి.రామారావు, గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు.
- పార్వతీపురం మండలం పెదమరికి గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన అధికారులు, తదితరులనుంచి రికవరీ చేయాలని బి.జనార్ధన రావు, ఇతరులు కోరారు.
- ఆర్‌బీకే ధాన్యం కొనుగోలు సెంటర్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు కొనసాగిస్తున్న తనకు మూడు నెలలుగా జీతం రావడంలేదని కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎన్. సురేష్ దరఖాస్తు అందజేశారు.
- పార్వతీపురం పట్టణం వేమకోటి వారి వీధి 26వ వార్డుకు గత మూడు నెలలుగా నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదని దాసరి.మంగమ్మ, వార్డ్ మెంబర్స్ అర్జీ అందజేశారు.
- సాలూరు మండలం సాలూరు గ్రామానికి చెందిన కె.నవీన్ కుమార్ తన భార్య మరణించి తొమ్మిది సంవత్సరాలు అయిందని మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరారు.
- భామిని మండలం కోరమ గ్రామానికి 20 సంవత్సరాలుగా బస్ స్టాప్ లేదని గ్రామానికి బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ ఎ.రఘుపతి నాయుడు, గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట రావు, హౌసింగ్ పీడీ టి.రఘురాం, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్, ఎం.డి నాయక్, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, ప్రణాళిక అధికారి పి. వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ ఎం.దీపిక



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి బాధితుల నుంచి 34 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఎస్పీ సీఐ ఇ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు వారి పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్ డీఎస్పీ బి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్వీ ప్రభాకర్, ఎస్సై పి.దినకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరినవారితో మంత్రి రాజన్నదొర, తదితరులు

మెంటాడ: మండలంలోని ఆండ్ర సచివాలయం పరిధి కుంబివలస, వేపగుడ్డి, పనసలవలస, కొండజీరికవలస, దోనిబల్లి గిరిజన గ్రామాలకు చెందిన వంద కుటుంబాల గిరిజనులు సోమవారం గిరిజనశాఖామంత్రి పీడికరాజన్నదొర సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ ప్రాంతంలో నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో భాగంగా వారు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గ్రామ పెద్దలు దుంబిరి.జంగమయ్య, నాగుల రాంబాబు, మాదాన రామయ్య, కొర్రా.అప్పన్న, సోమాలెరకయ్య, జన్ని సీతయ్య, కావు సింహాద్రి, సామెల కొండమ్మ, చినమర్రి కన్నయ్య, చినమర్రి నూకరాజు, చినమర్రి తౌడు,జన్ని అప్పారావు, జన్నిమంగయ్య, మాదాల పెంటయ్య, అంబయాన పైడిరాజు, జంబాని లచ్చయ్యతోపాటు పలు కుటుంబాల వారికి మంత్రి రాజన్నదొర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న మాలాంటి గిరిజనులు, పేదబడుగు బలహీన వర్గాలకు సంబంధించి ఎన్నో పథకాలను అందించడమే కాకుండా మా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు మంత్రి రాజన్నదొర మాట ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి పాలనకు మెచ్చి పార్టీలో చేరినట్లు చెప్పారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్టుల అందజేత



బెల్టులు సాధించిన క్రీడాకారులు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో తైక్వాండో క్రీడాకారులకు సోమవారం బెల్టు అర్హత పరీక్షలు నిర్వహించి, అర్హత పొందిన వారికి అందజేశారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్హత పోటీలకు 100 మంది క్రీడాకారులకు హాజరయ్యారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. ఎల్లో, గ్రీన్, బ్లూ బెల్టులకు అర్హత పొందిన క్రీడాకారులకు ముఖ్యఅతిథిగా హాజరైన కోరుకొండ సైనిక పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ ఎస్.కేశవన్, తైక్వాండో ఇన్‌చార్జి ముల్లా రఫీక్‌లు బెల్టులు, ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఈ పోటీలకు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ పరిశీలకుడిగా ఎం.అచ్చంనాయుడు, ఎగ్జామినర్‌గా సీహెచ్ వేణుగోపాలరావులు వ్యవహరించారు. ఈ సందర్భంగా బెల్టులు సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అధ్యక్షుడు గురాన అయ్యలు అభినందించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సీహెచ్. లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. బాబామెట్ట ప్రభుత్వ బాలికల పాఠశాల సమీపంలో విద్యార్థులకు బిస్కెట్స్, చాక్లెట్స్ విక్రయించే మహిళ వద్దకు ఇద్దరు వ్యక్తులు ఈ నెల16న ఉదయం 11.30 గంటల ప్రాంతంలో పల్సర్ బైక్‌పై వచ్చి ఆమె దగ్గర ఏదో కొనుగోలు చేసే విధంగా మాట్లాడుతూ, మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుని పరారయ్యారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు దాసన్నపేట వద్ద సోమవారం వాహన తనిఖీలు చేస్తుండగా పారిపోయేందుకు ప్రయత్నించిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామానికి చెందిన నిఖిల్ రెడ్డి, అలుపున రెడ్డిలను అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారి నుంచి పుస్తెలతాడు, పల్సర్ బైక్ రికవరీ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో క్రియాశీలకంగా పనిచేసిన ఎస్సై షేక్ శంకర్, ఏఎస్సై వై.పైడితల్లిని సీఐ అభినందించారు.

దారిదోపిడీ కేసులో ఐదుగురు..

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ పంచాయతీ మాసన ఆస్పత్రి సమీపంలో విజయనగరం-నాతవలస ఆర్‌అండ్‌బీ రహదారిపై రాత్రి వేళ ఆటోను నిలిపేసి, డ్రైవర్‌ను గాయపరిచి, డ్రైవర్ వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్ లాక్కున్న కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు హెచ్‌సీ సురేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. డెంకాడ గ్రామానికి చెందిన బి.అశోక్, ఎం.రవి, జి.రాజు, జి.బంగార్రాజు, కె.సాయికుమార్‌లు ఆదివారం రాత్రి పెదతాడివాడ పరిధిలోని మాసన ఆస్పత్రి సమీపంలో ఆటోను అడ్డగించి డ్రైవర్ సురపతి సూర్యనారాయణను గాయపరిచి, ఆయన వద్ద ఉన్న రూ.4 వేలతో పాటు సెల్‌ఫోన్ లాక్కుపోపారు. ఈ ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి, నిందితులను కోర్టుకు తరలించారు.

చిరుధాన్యాల సాగు పెంచేలా రైతుకు అవగాహన



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: చిరుధాన్యాల సాగును పెంచేలా జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించాలని జేసీ మయూర్ అశోక్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నాబార్డ్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల పని తీరుపై సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్లు వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందించాలని వ్యవసాయ సంబంధిత అధికారులకు సూచించారు. చిరుధాన్యాల సాగును పెంచేలా రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. లైసెన్సుల జారీ, కలెక్షన్ సెంటర్ల మంజూరులో జాప్యం చేయకూడదని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎఫ్‌పీఓలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వివిధ కేంద్ర సంస్థల ద్వారా ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారులు తమ వ్యాపార కలాపాలు పెంచుకోవడం ద్వారా వారి ఆర్థిక పురోగతిని సాధించాలన్నారు. సమావేశంలో నాబార్డ్ డీడీ నాగార్జున, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశు, మత్స్య శాఖల అధికారులు డాక్టర్ రమణ, నిర్మలాదేవి, మార్కెటింగ్ ఎ.డి శ్యామ్‌కుమార్ పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు చిరాయువు..!

మా మొర ఆలకించేదెవరు? ఏ భగవంతుడికి నివేదించుకోవాలి? ఏ నాయకుడు మా దుస్థితిని పట్టించుకుంటాడు? మా ఆవేదన ఎవరు వింటారు? ఇలా పలురకాలుగా మధన పడుతున్న అభాగ్య దంపతులకు నేనున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భరోసా కల్పించారు. వారి సమస్యను గట్టెక్కించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆ దంపతుల ఇద్దరు పిల్లలకు వైద్యం చేయించేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో మా పాలిట దేవుడు సీఎం జగన్ మోహన్ రెడ్డి అంటూ ఆ దంపతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. - చీపురుపల్లి

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- ఫలించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కృషి
- చికిత్స కోసం రూ.32 లక్షలు విడుదల
- హైదరాబాద్‌లోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో ప్రారంభమైన చికిత్స



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పిల్లల పరిస్థితిని వివరిస్తున్న తల్లిదండ్రులు(ఫైల్)

ఆ దంపతులు రోజూ కూలికి వెళ్తే తప్ప ఇల్లు గడవని పరిస్థితి. పని చేసుకుంటూ ఇద్దరు కొడుకులను పెంచుకుంటున్నారు. అయితే విధికి కన్నుకుట్టిందేమో కానీ ఆ పిల్లలిద్దరికీ సికిల్‌సెల్ ఎనీమియా అనే ప్రాణాంతక వ్యాధి సోకింది. ఆ వ్యాధి కారణంగా రక్తహీనతతో పోరాడుతున్న ఇద్దరు చిన్నారులను తల్లిదండ్రులు వారికున్న స్తోమత మేరకు ఆస్పత్రులకు తిప్పారు. కానీ అరుదైన వైద్యం అందితే తప్ప పిల్లలు బతకరనే సమాచారం తెలుసుకున్నారు. అరుదైన చికిత్స జరగాలంటే లక్షలాది రూపాయలు ఖర్చవుతాయి. అంత ఖరీదైన వైద్యాన్ని అందించలేక, పిల్లలను వదులుకోలేక ఎన్నో రోజులు ఏడ్చుకుంటూ ఇంటిలోనే గడిపారు. అదే సమయంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. ఆ సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'మీ బిడ్డలకు నేనున్నాంటూ' ఇచ్చిన భరోసా వారికి ధైర్యాన్ని ఇచ్చింది. మాట ఇవ్వడమే కాకుండా సికిల్ సెల్ ఎనీమియా అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలానికి చెందిన డీఆర్.వలస గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారుల వైద్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.32 లక్షలు నగదు విడుదల చేశారు. ఆ డబ్బుతో హైదరాబాద్‌లోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో చికిత్స ప్రారంభమైంది.

ఫలించిన జిల్లా పరిషత్ చైర్మన్ కృషి....

శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలంలోని డిఆర్.వలస గ్రామానికి చెందిన పొంద్రంగి రామారావు, సుబ్బలక్ష్మి దంపతుల కుమారులు తిరుపతిరావు(12), యశ్వంత్(10)లు సికిల్ సెల్ ఎనీమియా అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నారు. వారిద్దరికీ రూ.16 లక్షలు చొప్పున రూ.32 లక్షలు వైద్య ఖర్చులు అవసరమని ప్రముఖ ఆస్పత్రులు స్పష్టం చేశాయి. దీంతో గ్రామ ఎంపీటీసీ కుమరపు రమేష్‌నాయుడు ద్వారా వారు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును కలిసి సమస్య వివరించారు. దీంతో ఆయన 2022 ఆగస్టు 26న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం పర్యటనలో రామారావు, సుబ్బలక్ష్మి దంపతులను కలిపించి వారి పిల్లల పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. చిన్నారులకు వైద్య సహాయం అందిస్తామని సీఎం మాట ఇచ్చారు. ఆ తరువాత జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అమరావతి వెళ్లినప్పుడు మరోసారి సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డితో ఇదే విషయంపై చర్చించారు. దీంతో సీఎం ఇచ్చిన మాట ప్రకారం ఇద్దరు పిల్లలకు అవసరమయ్యే ఖర్చును రూ.32 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయగా అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ మూడు రోజులు క్రితమే చికిత్స ప్రారంభమైంది.

జగనన్న మా పాలిట దేవుడు



మా లాంటి పేదోళ్ల పాలిట ముఖ్యమంత్రి జగనన్నే దేవుడు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ద్వారా సీఎం జగనన్న దగ్గరకు వెళ్లి మా పిల్లల కష్టం చెప్పగానే నేనున్నాను చూసుకుంటానని ధైర్యం చెప్పారు. పిల్లల వైద్యం కోసం అప్పుడే అక్కడున్న పెద్ద అధికారులకు చెప్పారు. ఇప్పుడు పిల్లలు వైద్యం కోసం రూ.32 లక్షలు విడుదల చేశారు. మా పిల్లలకు ప్రాణం పోసిన దేవుడు జగనన్న.

- పొంద్రంగి రామారావు, తండ్రి

రూ.32 లక్షలు మంజూరయ్యాయి



పేదింటిలో జన్మించిన ఇద్దరు పిల్లల వైద్యం కోసం లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. అంత డబ్బు ఎలా సమకూర్చాలో తెలియలేదు. అప్పుడే జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వద్దకు వారిని తీసుకుని వెళ్లాను. ఆయన విశాఖపట్నంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసే అవకాశం కల్పించగా మొత్తం పరిస్థితి వివరించాం. పిల్లల వైద్యం కోసం రూ.32 లక్షలు మంజూరు చేశారు.

- కుమరాపు రమేష్‌నాయుడు, ఎంపీటీసీ, డిఆర్.వలస